


## 'డబుల్' ఇండ్లలో వసతులు కల్పిస్తాం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- నూకపల్లిలో నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 7: జగిత్యాల అర్బన్ హౌసింగ్ కింద నూకపెల్లిలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం అధికారులు, నాయకులతో కలిసి ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. 4,520 ఇండ్ల నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సైతం సరైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా రూ.36 కోట్లతో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. రూ.1,700కే కొత్త విద్యుత్ మీటర్ ఇస్తున్నారని, దీనికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇక్కడ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, అడువాల లక్ష్మణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ చాంద్‌పాషా, ఏఈలు రాజమల్లయ్య, శరణ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లి చెంతకు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 7: దసరా పండుగకు బట్టలు కొందామని మెట్‌పల్లి పట్టణానికి వచ్చిన ఓ తల్లికి తప్పిపోయిన తన నాలుగేళ్ల కుమారుడిని ఆర్టీసీ అధికారులు సురక్షితంగా అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా రెంజర్ల మండల కేంద్రానికి చెందిన తుమ్మల ప్రశాంతి తన నాలుగేళ్ల కుమారుడు అనుశిత్, రెండేళ్ల కూతురును వెంట బెట్టుకొని సోమవారం మెట్‌పల్లి పట్టణానికి వచ్చి, ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లి బట్టలు కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో కుమారుడు షాపింగ్ మాల్ నుంచి బయటకు వెళ్లి సమీపంలోని ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించిన ఆర్టీసీ అధికారులు వివరాలు అడుగగా, తల్లిదండ్రుల పేరుతో పాటు ఊరు పేరు కూడా చెప్పాడు. దీంతో అధికారులు రెంజర్ల పోలీసు స్టేషన్‌కు సమాచారమివ్వగా, కొద్దిసేపటి తర్వాత తల్లి ఫోన్ నంబరును అందించారు. అప్పటికే కొడుకు కోసం గాలిస్తున్న తల్లిని ఆర్టీసీ అధికారులు బస్టాండుకు పిలిపించి తన కొడుకును అప్పగించడంతో ఊపిరి పీల్చుకుంది. ఇక్కడ మెట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజు, స్టేషన్ మేనేజర్ సురేశ్, సిబ్బంది రాజేశ్వర్, రాములు, సెక్యూరిటీ కానిస్టేబుల్ రమేశ్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జగిత్యాల రూరల్, అక్టోబర్7: ధరూర్ గ్రామానికి చెందిన పెండెం రవి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పూర్వ విద్యార్థులు (1987లో ఎస్సెస్సీ బ్యాచ్) సోమవారం పరామర్శించారు. వారి వంతుగా బాధిత కుటుంబానికి రూ.10వేలు అందించారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు ఉన్నారు.

# కదం తొక్కిన పంచాయతీ కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా
- సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

జగిత్యాల, అక్టోబర్ 7: గ్రామ పంచాయతీల కార్మికులు కదంతొక్కారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టారు. ముందుగా జగిత్యాల పాత కలెక్టరేట్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, డంపింగ్ యార్డు నిర్వహణ, హరిత హారం, పల్లె పకృతి వనాలు పెంపు పనులు చేస్తూ పల్లె ప్రజల బాగు కోసం అనునిత్యం శ్రమిస్తున్న కార్మికులకు నేటికీ తగిన గుర్తింపు, శ్రమకు తగిన వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇస్తున్నదే అతితక్కువ వేతనాలు, అవికూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో అప్పులపాలై అరిగోసపడుతున్నారని, పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు కార్మికులను పూర్తిగా విస్మరిస్తున్నదని వాపోయారు. వెంటనే మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పీఆర్సీలో పంచాయతీ కార్మికులకు చోటు కల్పించాలని, కనీస వేతనాలు అమలు, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ లాంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యువజన జిల్లా అధ్యక్షులు కోమటి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గర్వందుల రమేశ్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు మ్యాతరి మల్లవ్వ, వంగ రాజేశం, జంగిల్ ఎల్లయ్య, రడపాక శంకరయ్య, బేతి లక్ష్మయ్య, గుడిసె దేవయ్య, వటకాపురం రాజయ్య, ఎల్లయ్య, లక్ష్మి నర్సవ్వ, చంద్రయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

# 104 మొబైల్స్ పట్టేశారు

- జగిత్యాల పోలీసుల కృషి
- సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తింపు
- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు అందించిన ఎస్పీ అశోక్‌కుమార్




పోలీసులు రికవరీ చేసి అందించిన మొబైళ్లను చూపెడుతున్న బాధితులు, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 7: జగిత్యాల పోలీసులు ఫోన్ల రికవరీలో ముందున్నారు. విశేష కృషి చేస్తున్నారు. జిల్లాలో పోగొట్టుకున్న, చోరీ జరిగిన మొబైళ్లను సీఈఐఆర్ అప్లికేషన్ సాయంతో వెనువెంటనే గుర్తిస్తూ బాధితులకు అందజేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా రూ.20లక్షల విలువైన 104 మొబైల్స్‌ను గుర్తించగా, సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు ఎస్పీ అశోక్‌కుమార్ అందజేశారు.

### ఫోన్ పోయిన వెంటనే సమాచారం ఇవ్వాలి: ఎస్పీ అశోక్ కుమార్

మొబైల్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్( www.ceir.gov.in)లో వివరాలు నమోదు చేసి సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం అందించాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్లు సులభంగా రికవరీ చేయవచ్చని, ఇందుకు జిల్లాలో ప్రత్యేకంగా టీంను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనే ముందు వాటి ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా చెక్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్స్ రికవరీ చేసిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రహీంఖాన్, సీఈఐఆర్ టీం ఆర్ఎస్సై కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్స్ మల్లేశం, అజర్, యాకుబ్‌ను ఎస్పీ అభినందించారు. కాగా, కాగా, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెతికి అందించినందుకుగాను బాధితులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

## క్రీడలతో స్నేహభావం

రాయికల్, అక్టోబర్ 7: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంపీవో సుష్మా పేర్కొన్నారు. భూపతిపూర్ గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఇక్కడ జీపీ కార్యదర్శి హరికృష్ణ, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, గుర్రం మహేందర్, మంగళారపు లక్ష్మీనారాయణ, నూకల గంగాధర్, గుర్రం మల్లేశం, పీఈటీలు ప్రతాప్, దేవేందర్, విక్రమ్, రమేశ్, సత్య తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్లాపూర్, అక్టోబర్ 7: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎల్లాపూర్‌కు చెందిన అడ్లూరి నర్సయ్య(40) తన ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల కోసం పాతదాంరాజ్‌పల్లికి వచ్చాడు. తిరుగుపయనంలో సంగెం–శ్రీరాంపూర్ శివారుకు చేరుకోగానే రోడ్డుపై నిలిపి ఉన్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగిత్యాల, అక్టోబర్ 7: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు ఆడిపాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఆయన సతీమణి దీవెన, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, శీలం ప్రియాంక ప్రవీణ్, గట్టు సతీష్, వొల్లెం మల్లేశం, రిజ్వాన్, మాజీ ఎంపీపీలు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉదయశ్రీ, కౌన్సిలర్లు మారంపెల్లి రాణి, శ్రీధర్ రెడ్డి, అనిల్, బర్కం మల్లేశం, కంటే గంగారాం, ప్యాక్స్ చైర్మన్లు, భగవాన్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు

## కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బత్తిని మల్లీశ్వరి

మల్యాల, అక్టోబర్ 7: మల్యాల, కొడిమ్యాల మండలాలను కలుపుతూ ఏర్పడ్డ మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి రాజేశ్వరి, సూపర్‌వైజర్ శ్రీదేవి సమక్షంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా గడ్డం జీవన్‌రెడ్డితోపాటు పాలకవర్గసభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను గంగాధర, చొప్పదండి, రామడుగు, బోయిపల్లి మార్కెట్ కమిటీల చైర్మన్లు జాగిరి అనిత శ్రీనివాస రెడ్డి, కొత్తూరి మహేశ్, తిరుమల తిరుపతి, ఇలియాస్ సత్కరించారు.

## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 7: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.